ఖరీఫ్ సాగుకు సహకారం అందేనా!

- ఇప్పటికీ అందని అన్నదాత–సుఖీభవ
- సాగునీరు, ఎరువులు అందించాలని వినతి



గుర్రపుడెక్కతో నిండిన పుల్లేరు కాలువ



కపిలేశ్వరపురం పరిధిలో పోసిన నారుమడి

పమిడిముక్కల: కోటి ఆశలతో ఖరీఫ్ సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. గత సంవత్సరం వరికి మద్దతు ధర లభించకపోవడం, రైతు పండించిన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొనుగోలు చేయకపోవడం , భారీ వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. రైతులకు పెట్టుబడి సాయంగా అందించే అన్నదాత–సుఖీభవ కూడా అందలేదు. ఈ సీజన్‌లోనైనా ప్రభుత్వ సహకారం అందేనా అని ఆశగా ఎదురుచూస్తున్నారు. మండలంలో 20 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తారు. వాతవరణం అనుకూలంగా ఉండటం, రైతు సేవా కేంద్రాల్లో వరి విత్తనాలు అందుబాటులో ఉండటంతో వరిసాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. పొలాలను దుక్కి దున్ని, నారుమడులు పోసే పనిలో నిమగ్నమయ్యారు.

కాలువలు ఇలా..

మండల పరిధిలోని పుల్లేరు, బందర్ కాలువ, భీమనది చానల్ ద్వారా పొలాలకు సాగునీరు సరఫరా అవుతుంది. ఈ కాలువల్లో పలు చోట్ల గుర్రపుడెక్క పేరుకుపోయి ఉంది. ఈ కాలువలకు అనుబంధంగా ఉన్న డ్రెయిన్లలో కూడా గుర్రపుడెక్క, తూటుకాడ అల్లుకుపోయి ఉంది. కాలువల్లో మట్టిమేట వేసి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారింది. దీంతో కాల్వ చివరి భూములకు సాగునీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఐనంపూడి పరిధిలో కాల్వ కట్టలను పటిష్ట పరచాల్సి ఉంది.

సకాలంలో సాగు నీరు అందించాలి



వాతావరణం అనుకూలంగా ఉండటంతో దుక్కులు దున్ని మోటార్ల కింద నారుమడులు పోసుకొంటున్నాం. కాలువలు పూడిక తీయాలి. కాలవల్లోని గుర్రపుడెక్క, తూటుకాడ తొలగించాలి. కాల్వ చివరి భూములకు సకాలంలో సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలి.

– కనుమూరి వెంకటేశ్వరరావు, కౌలురైతు, లంకపల్లి

ఎరువులు అందు బాటులో ఉంచాలి



విత్తనాలతో పాటు ఎరువులు కూడా అందుబాటులో ఉంచాలి. రైతు సేవా కేంద్రంలోగాని, పీఏసీఎస్‌ల్లో గాని రైతులకు అందుబాటులో ఉంచాలి. వరికి మద్దతు ధర లభించేలా, పండిన ధాన్యమంతా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలి.

– బొబ్బా బాబూరావు, రైతు, అగినపర్రు

అందుబాటులో వరి విత్తనాలు



రైతు సేవా కేంద్రాలు, వ్యవసాయశాఖ కార్యాలయంలో 1061,1318 రకం విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. కావాల్సిన రైతులు కార్యాలయంలో సంప్రదించాలి. 1224,1262 రకం విత్తనాలు మార్టేరులో ఉన్నాయి. కావాల్సిన వారు మమ్మల్ని సంప్రదించాలి. ఖరీఫ్ సీజన్‌కు ఎరువులు కూడా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకొంటాం.

– గణేష్‌రెడ్డి, ఏఓ

షైనింగ్ స్టార్ పురస్కారాలకు ఏడుగురి ఎంపిక



జువారియ ఫిర్దోస్



జి.దుర్గా ప్రకాష్



కాగిత యామిని



ఎం.చరితశ్రీ



పి.వినీత



కౌషిక్

పమిడిముక్కల: మండలం నుంచి పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన ఏడుగురు విద్యార్థులు షైనింగ్ స్టార్ పురస్కారాలకు ఎంపికైనట్లు ఎంఈఓ–2 శ్రీనివాస్ తెలిపారు. పురస్కారాలకు ఎంపికైన వారిలో జీసస్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు జువారియ ఫిర్దోస్(579), జి.దుర్గాప్రకాష్(575), కాగిత యామిని(575), ఎం.చరితశ్రీ (572), పి.వినీత(570), కౌషిక్(520), ఎంకే బాబు పబ్లిక్ స్కూల్‌కు చెందిన శిరీష(570) ఉన్నట్లు పేర్కొన్నారు. వీరికి ఈ నెల9న జెడ్పీ కన్వెన్షన్ హాల్లో జరిగే కార్యక్రమంలో అవార్డులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

9 నుంచి బలుసులమ్మ ఉత్సవాలు

ముదినేపల్లి రూరల్: మండలంలోని శ్రీహరిపురం పంచాయతీ శివారు ఐనంపూడిలోని బలుసలమ్మ తల్లి ఉత్సవాలు ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఏరువాక పౌర్ణమి సందర్భంగా శ్రీవినాయక వల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సమేత బలుసలమ్మ ఉత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు.

మూగ జీవాలకు విముక్తి

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు మండలం వడ్లమన్నాడు గ్రామ శివారులో అక్రమంగా కబేళాకు తరలిస్తున్న గోవులకు విముక్తి కలిగింది. శనివారం స్థానిక పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు కబేళాకు తరలించేందుకు 22 ఆవు దూడలను సిద్ధం చేశారు. గో సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు గుడ్లవల్లేరు ఎస్ఐ ఎన్.వి.వి.సత్యనారాయణ తెలిపారు. గోవులను సంరక్షించే నిమిత్తం పెదముత్తేవి గోశాలకు వాటినివ పంపించామని ఎస్ఐ పేర్కొన్నారు.

నేడు భ్రమరాంబ, మల్లికార్జునుల పునఃప్రతిష్ట

మండవల్లి: మండలంలోని భైరవపట్నం శివారు శోభనాద్రిపురంలో ఆదివారం ఉదయం 7.44 నిముషాలకు శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి పునఃప్రతిష్ట మహోత్సవం నిర్వహించనున్నట్లు తాడికొండ రాజభైరవానందం, సలహాసంఘం సభ్యులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 5 గంటలకు గణపతిపూజ ఉంటుందని తెలిపారు.

నేడు విజయ గణపతి ఆలయ, విగ్రహ ప్రతిష్ట

కొమరవోలు(పామర్రు): మండలంలోని కొమరవోలు గ్రామ శివారు గాంధీ ఆశ్రమంలో ఆదివారం త్రయాహ్నిక దీక్షతో నూతన ఆలయ విగ్రహ, ప్రతిష్టా ధ్వజస్తంభ ప్రతిష్టా మహోత్సవాలను ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ ఆలయంలో పలు హోమాలు, పూజలను నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 7.47 గంటలకు నూతన ఆలయంలో విజయగణపతి, కుమారస్వామి, అయ్యప్పస్వామి, ద్వారపాలకులు, షిర్డి సాయిబాబా విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు తెలిపారు.

కొత్తవరంలో..

గుడ్లవల్లేరు: కొతవరం చిన దళితవాడలో శ్రీ సీతా రామచంద్ర ఆలయ, విగ్రహాల ప్రతిష్ట మహోత్సవాలను శనివారం నిర్వహించారు. ఈ ఆలయ నిర్మాణానికి స్వర్గీయ వడ్లమూడి రమేష్‌బాబు స్మారకార్థం దాత వడ్లమూడి సరోజిని(యూఎస్ఏ) రూ.35లక్షలను విరాళంగా అందించినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఒకటో వార్డులో..

కొతవరం ఒకటో వార్డులోని పోలీస్‌స్టేషన్ ఎదుట ఉన్న రామాలయాన్ని పునర్నిర్మించేందుకు నిర్వాహకులు భూమిపూజ చేపట్టారు. ఈ ఆలయానికి పూర్వ వైభవం తీసుకు రావటమే తమ కమిటీ ముఖ్యోద్దేశమని ఆ కమిటీ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాస్ తెలిపారు.



ఆలయ ప్రతిష్టా మహోత్సవంలో భాగంగా హోమం నిర్వహిస్తున్న రుత్వికులు



కొతవరం చిన దళితవాడలో సీతారామచంద్ర ఆలయ పూజల్లో దాత సరోజిని తదితరులు

ఘనంగా ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు



గుడివాడలో యాగశాల ప్రవేశ కార్యక్రమం నిర్వహిస్తున్న అర్చకులు



ప్రత్యేక పూజలు పాల్గొన్న బాపిరెడ్డి, విజయభాస్కరమ్మ దంపతులు

గుడివాడ టౌన్: స్థానిక జగన్నాథపురం పాటిమీద వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా శనివారం యాగశాల ప్రవేశం, కుంభారాధన, తోరణపూజ, అగ్నిప్రతిష్ఠ హోమం, ధ్వజారోహణ కార్యక్రమాలు నిర్వహించారు. ధజస్తంభానికి ముక్కోటి దేవతల ఆహ్వానం కోసం ఆహ్వానపత్రిక ఎగురవేశారు. సంతానం లేని దంపతులకు గరుడముద్ద ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కె.వేణుగోపాలరావు, ఆలయ అర్చకులు వేదాంతం అప్పలాచార్యులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ పాలడుగు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరాలయ దశమ వార్షికోత్సవాలు

గుడ్లవల్లేరు: భూ సమేత వెంకటేశ్వరస్వామి ఆలయ దశమ వార్షికోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు.

ఆలయ వ్యవస్థాపకులు, మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(మెయిల్) అధినేత పురిటిపాటి వెంకటకృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతులు ఆధ్వర్యంలో ఈ వార్షికోత్సవాలను చేపట్టారు. ఈ వేడుకల్లో డోకిపర్రు మాజీ సర్పంచ్ పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి, కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏడాది పొడవునా నీరు ఉంటేనే మనుగడ

మండవల్లి: కొల్లేరులో ఏడాది పొడవునా నీరు నిల్వ ఉంటేనే సరస్సు మనుగడ, అభివృద్ధి, ప్రజల జీవనోపాధి, ప్రకృతి పరిరక్షణ, జీవరాశుల మనుగడకు సాధ్యపడుతుందని, ఇందుకు రెగ్యులేటర్ నిర్మాణమే శరణ్యమని సామాజికవేత్త ఎల్ఎస్ భాస్కరరావు అన్నారు. శనివారం కొల్లేరు సరస్సును సందర్శించి వరద నీరు సముద్రంలోనికి పోకుండా రెగ్యులేటర్లు నిర్మించి ప్రభుత్వాలు శ్రద్ధ చూపి నీటిని నిల్వ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సరస్సును సందర్శించిన అనంతరం మాట్లాడుతూ ప్రస్తుతం సరస్సు ఎండిపోయి ఎడారిని తలపిస్తుందన్నారు. ఇప్పటికైనా రెగ్యులేటర్లు నిర్మించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్



తోట్లవల్లూరులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



అలీనఖీపాలెంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



వెంట్రప్రగడ మసీద్‌లో బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లింలు



కొతవరం చెక్‌పోస్టు మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



పామర్రులో ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు



గుడివాడలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు



అల్లినగరంలో బక్రీద్ సందర్భంగా ప్రార్థనకు విచ్చేసిన ముస్లింలు

తోట్లవల్లూరు: బక్రీద్‌ను ముస్లింలు శనివావారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయాన్నే పవిత్ర స్నానాలను ఆచరించి, నూతన వస్త్రాలను ధరించి ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. స్థానిక అంజుమన్ భవనంపై జరిగిన సామూహిక ప్రార్థనల్లో ముస్లింలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. మతగురువు హసన్ దైవసందేశం వినిపించారు. అనంతరం ఐక్యతా ర్యాలీ నిర్వహించారు.

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: మండలంలోని గురజాడ, కపిలేశ్వరపురం, వీరంకిలాకు, ఫత్తేలంక, మేడూరు గ్రామాల్లో బక్రీద్‌ను ఘనంగా జరుపుకున్నారు. అలీనఖీపాలెంలోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముస్లింలకు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ శుభాకాంక్షలు తెలియజేశారు.

పెదపారుపూడిలో..

పెదపారుపూడి: మండలంలోని పలు గ్రామాల్లో బక్రీద్‌ను ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని వెంట్రప్రగడ, లక్ష్మీపురం, కొర్నిపాడు గ్రామాల్లో ఉన్న మసీద్‌లలో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: బక్రీద్ సందర్భంగా ముస్లింలు పట్టణంలోని మియాఖాన్, గుల్జార్‌చౌక్, షాహి, నూర్, కార్మికనగర్ మసీదులలో శనివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అల్లాపై భక్తుల విశ్వాసాన్ని తెలియపర్చే ఈ పర్వదినం ముస్లింలకు ఎంతో ప్రాముఖ్యమైనది. ఖురాన్‌లో బక్రీద్ పర్వదినం ఎందుకు నిర్వహించాలి, ఆ సందర్భం ఏమిటి తదితర విషయాలను మసీదు కాజాలు వివరించారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: బక్రీద్‌ను పురస్కరించుకుని ముస్లింలు గుడ్లవల్లేరు మండలంలోని మసీదుల్లో శనివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కొతవరం ఒకటో వార్డు, చెక్‌పోస్టు, తురాయిపాలెం, లంకాదొడ్డి, శేరీ దుగ్గిమిల్లి, కట్టవానిచెరువు, పెంజెండ్ర మసీదుల్లోని జరిగిన ప్రార్థనల్లో భారీగా ముస్లింలు పాల్గొన్నారు.

కైకలూరులో..

కైకలూరు: భక్తి, త్యాగానికి, మానవత విలువలకు బక్రీద్ నిదర్శనమని మత పెద్ద ఇలాహుల్ హక్ చెప్పారు. కైకలూరులో బక్రీద్ వేడుకను ముస్లింలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. బక్రీద్ సందర్భంగా ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. జామియా మసీదు అధ్యక్షుడు ఎండీ.అమీర్, చిన్న మసీదు అధ్యక్షుడు ఎండీ.సర్కార్ పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: మండలంలో బక్రీద్ పండుగను ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మసీదులకు వెళ్లి అల్లాను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

పామర్రులో..

పామర్రు: బక్రీద్ సందర్భంగా ముస్లింలు శనివారం పామర్రు ఈద్ గాహ్ నందు సామూహికంగా ప్రార్థనలు చేశారు. మత పెద్ద ఇమామ్ యునుస్ దైవసందేశమిచ్చారు. అబ్దుల్లా, ఆరీఫ్, ముస్తఫా, ఇబ్రహీం , కరీముల్లా, ఖలీక్, సోయిల్ పాల్గొన్నారు.

నేడు ఉచిత మధుమేహ వైద్య పరీక్షలు

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవాభవన్‌లో ఆదివారం ఉచిత మధుమేహ వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని శనివారం లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం

గుడ్లవల్లేరు: ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు ఆధ్వర్యంలో శనివారం గుడ్లవల్లేరులో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 358 మందికి రోగులకు వైద్యులు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



తోట్లవల్లూరు: క్రీడలతో మంచి ఆరోగ్యంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని తోట్లవల్లూరు ఎస్ఐ సీహెచ్ అవినాశ్ తెలిపారు. స్థానిక కనకదుర్గమ్మ కాలనీ సమీపంలో తోట్లవల్లూరు యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రీమియర్ లీగ్ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ఆహ్లాదకర వాతావరణంలో జరుపుకోవాలని అవినాశ్ సూచించారు.

వైఎస్సార్ సీపీ పటిష్టతకు కృషి



కైకలూరులో నియామక పత్రాలను అందజేస్తున్న డీఎన్నార్

కైకలూరు: గ్రామ స్థాయిలో వైఎస్సార్ సీపీ పటిష్టతకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద కలిదిండి మండలం ఎస్ఆర్‌పీ అగ్రహారం, సానారుద్రవరం, పడమటిపాలెం, మండవల్లి మండలం పులపర్రు గ్రామ కమిటీలకు నియామక పత్రాలను శనివారం అందించారు. ఈ సందర్భంగా డీఎన్నార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై ఏడాదిలోనే ఎన్నికల హామీలను అమలు చేయడం లేదనే విమర్శలు వచ్చాయన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన మేలును, ప్రస్తుత పరిస్థితిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఇప్పటి నుంచి నియోజకవర్గ కార్యకర్తలందరూ ప్రజల పక్షాన నిలిచి వారి సమస్యలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ముదిరాజుల సంఘ రాష్ట్ర అధ్యక్షులు కోమటి విష్ణువర్ధనరావు, కైకలూరు, మండవల్లి మండల పార్టీ అధ్యక్షులు సింగంశెట్టి రాము, బేతపూడి ఏసోబురాజు, నియోజకవర్గ పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడు రవికుమార్, నాయకుడు రామారావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ఆందోళన



గుడ్లవల్లేరు: మండలంలో ఐక్య ఉపాధ్యాయ సంఘాల వేదిక ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధ్యాయులు శనివారం ఆందోళన చేపట్టారు. ఎస్‌జీటీ బదిలీలు వెబ్ కౌన్సిలింగ్ నిర్వహించడాన్ని వ్యతిరేకిస్తూ ఐక్య వేదిక తరపున బాయకాట్ చేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఎంఈఓల ద్వారా టీచర్లను వెబ్ ఆప్షన్స్ పెట్టాలని ఒత్తిడి చేయటం తగదని ఉపాధ్యాయ సంఘ నాయకులు పేర్కొన్నారు. పైగా మండల కేంద్రాల్లో కంప్యూటర్లు ఏర్పాటు చేసి, టీచర్లను పిలిపించి వెబ్ ఆప్షన్స్ పెట్టడాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ ఆందోళనలో భాగంగానే డీఈఓ కార్యాలయాన్ని కూడా ముట్టడించనున్నామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఏవీ వరలక్ష్మి, ఆ సంఘ మండల అధ్యక్షుడు ఎం.ఆరోగ్యం, ప్రధాన కార్యదర్శి పి.హరి శ్రీనివాస్, ఏపీటీఎఫ్ నాయకులు డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మృతుడి కుటుంబాన్ని ఆదుకుంటాం



పామర్రు: మృతుడి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు జొన్న లక్ష్మీనారాయణ భార్య నాగమణి(65) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో అనిల్‌కుమార్ మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం నాగమణి మృతదేహం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు తాడిశెట్టి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, మండల, టౌన్ అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వరరావు, నందిపాటి సురేష్‌రెడ్డి, కో–ఆప్షన్ సభ్యులు ఎండీ హస్మతుల్లా తదితరులు పాల్గొన్నారు.

శరణాలయానికి సీలింగ్ ఫ్యాన్ల వితరణ



గుడివాడ టౌన్: స్థానిక మందపాడులోని నైట్ షెల్టర్ వృద్ధాశ్రమానికి కృష్ణ, మహేష్‌బాబు అభిమానులు శనివారం రెండు సీలింగ్ ఫ్యాన్లు వితరణగా అందజేశారు. గతనెల 31వ తేదీన సూపర్‌స్టార్ కృష్ణ జయంతి వేడుకల సందర్భంగా నైట్ షెల్టర్ వృద్ధులకు భోజన వసతి, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా షెల్టర్‌లో ఆశ్రయం పొందుతున్న వృద్ధులు వేసవిలో ఫ్యాన్లు లేక ఇబ్బందులు పడుతున్నామని కృష్ణ అభిమానుల దృష్టికి తేగా ఆయన అభిమానులు కొందరు శనివారం రెండు సీలింగ్ ఫ్యాన్లు అందజేశారు.

వెంకన్న భక్తులకు అన్నసమారాధన



గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా స్వామిని దర్శించుకునేందుకు శనివారం భక్తుల సందడి అధికమైంది. ఈ సందర్భంగా భక్తులకు భారీ అన్నసమారాధనను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతుల చేతుల మీదుగా ప్రారంభించారు.

చటాకాయి సర్పంచ్ శేషారావు మృతి



కైకలూరు: గుండెపోటుతో చటాకాయి గ్రామ సర్పంచ్ ఘంటసాల శేషారావు(66) శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పాలనలో సర్పంచ్‌గా పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనే వ్యక్తిని కోల్పోయామన్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సింగంశెట్టి రాము, నాయకులు సమయం వీరాంజనేయులు పరామర్శించిన వారిలో ఉన్నారు. అదేవిధంగా ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, రాష్ట్ర వడ్డీ సాధికారత కన్వీనర్ బలే ఏసురాజులు శేషారావు మృతదేహానికి నివాళులర్పించారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఇద్దరు విద్యార్థినుల ఎంపిక



తోట్లవల్లూరు: కేంద్ర ప్రభుత్వం అందించే నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)కు మండలంలోని గరికపర్రు జెడ్పీ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంపికయ్యారని పాఠశాల హెచ్ఎం అడిదం శ్రీకృష్ణ తెలియజేశారు. పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న నరేంద్ర యోగశ్రీ, వీరంకి పల్లవి ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారని, నాలుగేళ్ల పాటు వీరికి ఏడాదికి రూ.12 వేల చొప్పున కేంద్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్‌గా అందిస్తుందని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను హెచ్ఎం శ్రీకృష్ణ, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.